తెలుగు సారస్వత సాంస్కృతిక సంఘము

Telugu Literary And Cultural Association

# సంక్రాంతి లక్ష్మి

*Durgaprasad Varanasi*

This page uses Unicode. If your computer does not display Telugu script, please read and enjoy the pdf version. If you would like to set your computer up to display Telugu Unicode, please see help here

రావమ్మ! రావమ్మ! రమణీ సంక్రాంతీ!
రావమ్మ! ప్రసరింప రమణీయ కాంతి! ||రా||

దివినుండి దిగివచ్చి భువిజేరు తల్లీ
భువికిమ్ము యెనలేని భోగాలు తల్లీ! ||రా|
అభయంబునీయమ్మ ఓ కల్పవల్లీ
శుభమూనొసంగుమా మా కన్నతల్లీ
నభలోకవాసినీ! నారాయణీ! లక్ష్మి!
త్రిభువనాధీశవక్షోవిలాసినీ! లక్ష్మి! ||రా||

భోగిమంటలవెంట భువికిరమ్మొతల్లి
భోగిపండ్లగునా రేగిపండ్లుగరమ్ము
సాగిపోవంగ భవసాగరమ్మియిలను
సాగరాత్మజ! రమ్ము సంక్రాంతి! మాతల్లి! ||

బొమ్మల్ల కొలువందు బొమ్మపై రావమ్మ
మమ్మెల్ల బ్రోవంగ మకర సంక్రాంతీ!
సమ్మెదమ్మొలికించు సరసీరుహాక్షీ!
రమ్ము మమ్మేల రయమునో సంక్రాంతీ! ||రా||

వరిధాన్యరాసియై వసుధయే వర్ధిల్ల
సిరిసంపదలతోటి శ్రీరూపమును దాల్ప
వరమీయుమోతల్లి వరలక్ష్మి సంక్రాంతి!
దరిజేర్చి కరుణించు కరుణాబ్ధి సంక్రాంతీ! |రా||

శోభాయమానమౌ నోయగస్వరూపమ్ము
సౌభాగ్యవతి మా ధరియిత్రి ధరియింప
మాభాగ్యములనెల్ల మాకొసగుమో తల్లి
మాభాగ్యరాసిగా మము జేరుమా తల్లి! ||రా||

సుందర రమణుల డెందమ్ములందునన్
పొందెడి నొములన్ పోషించు వరలక్ష్మి!
అందాల నొలుకంగ నవనింబ్రోవుము లక్ష్మి
ఇందిరమ్మా! హే! ఇందీవరాక్షీ! ||రా||

కన్నెలందరి నోములన్నియును పండించు
కన్నతల్లివి నీవు, కనికరించమ్మా
వన్నెచిన్నెల వసుధ వెలయంగ రావమ్మ
కన్నులారగ నిన్ను కాంచంగ రావమ్మ!||రా||

Post your comments on this article